PYARE RASOOL (S)
(Telugu)

صَلَّى اللّٰهُ عَلَيْهِ وَسَلَّمَ

# మన ప్రియ ప్రవక్త

## (సల్లల్లాహు అలైహి వ సల్లం)

మూలం:

**అఫ్జల్ హుసైన్**

TIP TRUST

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజిష్టర్డ్)
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002. ఫోన్: 24564583

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# మన ప్రియ ప్రవక్త

## (సల్లల్లాహు అలైహి వ సల్లం)

సృష్టికర్త అయిన అల్లాహ్ అన్నిటిని సృష్టించాడు. భూమ్యాకాశాల్ని నిర్మించాడు. సూర్యచంద్రుల్ని వెలిగించాడు. మెరిసే నక్షత్రాలనిచ్చాడు. ఆయన ఆజ్ఞ వల్లనే గాలి వీస్తూంది. మేఘాలు వస్తున్నాయి, వర్షాలు కురుస్తున్నాయి, పంటలు పండుతున్నాయి, ధాన్యం లభిస్తుంది. తినడానికి తిండి, త్రాగడానికి నీరు ఉన్నాయి. ఆయనే మన అవసరాలన్ని తీరుస్తున్నాడు. ఆయనే అందరి సృష్టికర్త, పోషణకర్త కూడా. ఆయనే మన ప్రభువు, శాసన కర్త. మనమందరం ఆయనకు దాసులం. ఆయనే మన యజమాని. అందుచే ఆయన ఆజ్ఞల్ని ఆలకించి పాలించడం మన కర్తవ్యం. ఆయన్ను ఆరాధించడం మన జీవిత ధ్యేయం. అందరికీ ఆయనే రాజాధిరాజు. ఆయన సామ్రాజ్యం అనంతం. ఆ రాజ్యంలోని ఒక చిన్న భాగమే ఈ ప్రపంచం. ప్రపంచంలో మానవుణ్ణి సృష్టించాడు విశ్వప్రభువు. ఆ మానవుణ్ణి తన ప్రతినిధిగా నియమించాడు. అతనికి అవసరమైన వస్తువులన్ని ఇచ్చాడు. జీవితం గడిపే విధానం నేర్పించాడు. మనకు తన అభిమతం ఏమిటో తెలియజేశాడు. అందుకోసం ప్రవక్తల్ని పుడమిపై పంపాడు. ప్రవక్తలూ మానవమాత్రులే. వారూ దైవదాసులే. ఆయన దాస్యం చేస్తూ జీవితం గడిపినవారే.

ప్రవక్తలు నిత్యం సత్యం పలికేవారు. ఏ పాపం చేసే వారు కారు.

మానవులకు అల్లాహ్ ఇచ్చిన ఆజ్ఞల్ని వినిపించేవారు. ప్రభువు పంపిన సందేశాన్ని పరిపూర్ణంగా ప్రజలకు తెలిపేవారు. దైవాభీష్టం ప్రకారం జీవితం గడిపి చూపారు. ప్రజల జీవితాలను దైవాభీష్టం ప్రకారం మలిచేవారు.

ప్రవక్తలు దైవసందేశాన్ని తెచ్చేవారు. అందుచేత వారిని సందేశ ప్రబోధకులని, ప్రవక్తలని అంటారు.

హ్రజత్ ఆదం (అలైహిస్సలాం) అల్లాహ్ పంపిన ప్రవక్త. హ్రజత్ నూహ్ (అలై) అల్లాహ్ పంపిన సందేశప్రబోధకుడు. హ్రజత్ ఇబ్రాహీం (అలై) దైవ ప్రవక్త. హ్రజత్ మూసా (అలై), హ్రజత్ దావూద్ (అలై), హ్రజత్ ఈసా (అలై) అందరూ దైవ ప్రవక్తలే. ఇంకా అనేక దైవ ప్రవక్తలు ప్రపంచంలో వచ్చారు. వీరందరు సత్యసంధులు, సత్పురుషులు కూడా. ప్రవక్తలందరు దైవసందేశాన్ని ప్రచారం చేశారు. దైవ అభీష్టాన్ని ప్రజలకు తెలిపారు. ప్రవక్తల వరుసలో చిట్టచివరి ప్రవక్త హ్రజత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం). వీరంటే అల్లాహ్‌కు ఎంతో ప్రేమ. వీరిపై అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌ను అవతరింపజేశారు. 'ఖుర్‌ఆన్' అల్లాహ్ మానవులకిచ్చిన చివరి గ్రంథం. మానవాళికి హితబోధ చేయడానికే అల్లాహ్ మహాప్రవక్తను పంపించాడు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) తరువాత మరో ప్రవక్త లేదు.

**"అల్లాహుమ్మ సల్లి అలాముహమ్మదిన్ వ అలా ఆలి ముహమ్మదిన్ వ బారిక్ వ సల్లమ్"**

## మహాప్రవక్త రాక ముందు

మన ప్రియ ప్రవక్త రాక ముందు ప్రపంచ పరిస్థితులు ఘోరంగా ఉండేవి. దైవాభీష్టం ఏమిటన్నది తెలిపే వారెవరూ లేరు. ప్రవక్తలు లేరు. ప్రబోధకులు లేరు. మానవులు మార్గభ్రష్టులయ్యారు. తమ

ఆరాధ్య దైవాన్ని విస్మరించారు. స్వామిద్రోహులయ్యారు. ప్రవక్తలు ప్రవచించిన బోధనల్ని మరిచారు. దైవం చూపిన వెలుగుబాట నుండి వైదొలిగారు. ఇష్టమొచ్చినట్లుగా మెలగసాగారు. తమలాంటి మానవుల పంథాను పాటించేవారు. అదీ కాదంటే తమ తమ జాతి వారు గుడ్డిగా పాటించే సంప్రదాయాలకు బలయ్యారు. దైవం పంపిన గ్రంథాలలో మార్పులు చేర్పులు చేశారు. వాటి రూపు రేఖల్నే మార్చేశారు. నచ్చిన విషయాల్ని పాటించేవారు. నచ్చని మాటల్ని తొలగించేశారు. రాయి రప్పల్ని విగ్రహాలుగా మలచారు. రూపు రేఖల్ని ఇచ్చి పూజించసాగారు. దేవీదేవతల్ని ఆరాధించ సాగారు. మొక్కుబడులు చేస్తూ వచ్చారు. దక్షిణలు సమర్పించుకొన్నారు. చెట్లు చేమలు, కొండలు గుట్టలు, నదీనదాలు, జీవ నిర్జీవాలు ఒకటేమిటి ఎన్నింటినో ఆరాధిస్తూ వచ్చారు. శతకోటి ప్రజలకు శతకోటి మార్గాలు ఉండేవి.

ఎక్కడ చూచినా పాపపు పనులే. పండిన పాపంలోపడి ప్రజలు మద్యం సేవించేవారు. జూదం ఆడేవారు, కయ్యానికి కాలుదువ్వేవారు, దొంగతనం దోపడీలు చేసేవారు, అబద్ధాలు పలికేవారు, ఇచ్చిన మాట నిలెబట్టుకొనే వారు కారు. దగాకోరుతనం వారి నిత్యవిధానం. ఇతరుల సొమ్ము దోచుకోవడం వారి వృత్తి. అనాథ బాలురను, నిస్సహాయులను వేధించడం వారి వినోదం. ప్రయాణీకులను ప్రయాసపెట్టడం వారి సహజ గుణం. మహిళలను మంటల్లో వేసి దహనం చేయడం వారి అలవాటు. ఆత్మగౌరవం పేరిట తమ బాలికలను నిండు ప్రాణాలతో ఖననం చేయడం వారి సంస్కృతి. నగ్న నృత్యాలతో లజ్జలేని జీవితాలు గడపడం వారి సామాజిక వ్యవహారం. జంతువుల్ని నానా విధాల హింసించేవారు. దేవుడిచ్చిన శాంతి మార్గాన్ని వదలడం వల్లనే ఈ చెడ్డపనుల్లో కూరుకుపోయారు.

మానవత్వం నశించింది, అశాంతి ప్రబలింది. అప్పుడు అల్లాహ్‌కు

జాలివేసింది. చెడు మార్గం పట్టిన ప్రజలకు సన్మార్గం బోధించడానికి అల్లాహ్ మన ప్రియ ప్రవక్తను పంపించాడు.

## వంశం

మన ప్రియ ప్రవక్త (సఅసం) పేరు హజ్రత్ ముహమ్మద్ (ముస్తఫా సల్లల్లాహు అలైహి వ సల్లం). మక్కా పట్టణంలో జన్మించారు. అరబ్బు దేశంలో మక్కా ఒక సుప్రసిద్ధ పట్టణం. పవిత్ర అల్లాహ్ గృహం కాబా ఇదే పట్టణంలో ఉంది. భారత దేశం నుండి ఎంతో దూరం సముద్ర ప్రయాణం చేశాక, లేదా విమానంలో ప్రయాణం చేశాక అరబ్బు దేశం వస్తుంది. ఇది మన దేశానికి పడమర వైపున ఉంది. అరబ్బు దేశంలో అనేక తెగల వారుండేవారు. ఆ తెగలన్నిటిలో వాసికెక్కిన వంశం ఖురైషు వంశం. ఈ వంశం వారే 'కాబా'ను చూచుకొనేవారు. అక్కడకు వచ్చిపోయే వారి సేవ చేసేవారు. కాబా నిర్వహణ వారి చేతుల్లో ఉండేది. అరబ్బులకు ఖురైషు వంశం వారంటే గౌరవం అధికం. మన ప్రియ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ వంశానికి చెందిన వారే.

ఖురైషు వంశంలో సుప్రసిద్ధులు ఎందరో ఉన్నారు. వారిలో ఖుసీ ఒకరు. ఆయన తన తెగ వారందరికి నాయకుడుగా ఉన్నారు. హజ్ చేసేందుకు వచ్చే హాజీలందరిని తన అతిథులుగా సన్మానించేవారు. హజ్ చేసే ముందు చాలా దినములు హాజీలను అన్నపాన వసతులతో సత్కరించేవారు. ఖుసీ సంతానంలో హాషీం అనే ఒక వ్యక్తి ఉండేవారు. హాషీం ధైర్య సాహసం కలవారు. దాన ధర్మాలు అమితంగా చేసేవారు. ఒకప్పుడు దేశంలో క్షామం వచ్చింది. హాషీం స్వంత డబ్బుతో ఎంతో ధాన్యం కొన్నారు. క్షామపీడిత ప్రజలకు ఉచితంగా పంచిపెట్టారు. ఈయనకు చాలా మంది కుమారులు వున్నారు. వారందరిలో అబ్దుల్ ముత్తలిబ్ ప్రఖ్యాతి గాంచినవారు. ఈయన ఖురైషు వంశీయులకు సర్దారుగా ఉండేవారు.

అరబ్బు దేశంలో నీటి ఎద్దడి ఎప్పుడూ ఉండేది. మక్కా వాసులకు 'జమ్‌జమ్' ఊట బావి గొప్ప వరప్రసాదం. కాని ఆ బావి అదృశ్యమైపోయింది. ఎక్కడ ఉందనేది ఎవరికీ తెలిసింది కాదు. అబ్దుల్ ముత్తలిబ్ ఎంతో కృషి చేసి వెతికి వెతికి దాని జాడ తెలుసుకొన్నారు. నిండివున్న పూడికను కష్టపడి తీయించారు. మక్కా వాసులకు అమృతం లాంటి నీటి వసతి చేకూర్చారు. చేసిన మేలు మరువని అరబ్బులు అబ్దుల్ ముత్తలిబ్ అంటే ఎంతో విలువనిచ్చే వారు. అబ్దుల్ ముత్తలిబ్‌కు మగ సంతానం ఎక్కువగా ఉండేది. కుమారులందరిలో అబ్దుల్లాగారిని గారాబంగా పెంచారు అబ్దుల్ ముత్తలిబ్. అబ్దుల్లాగారు బీబీ అమీనాతో వివాహ మాడారు. అబ్దుల్లా బీబీ అమీన దంపతులకు కలిగిన శిశువే మన ప్రియ ప్రవక్త ముహమ్మద్ (సఅసం).

## జననం మరియు శైశవం

మన ప్రియ ప్రవక్త (సఅసం) సోమవారం జన్మించారు. కాని పుట్టుకకు కొన్ని దినముల ముందే తండ్రి గారు దివంగతులయ్యారు. తాతగారు ఉన్నారు. మనుమడు పుట్టినందుకు సంతోషపడ్డారు. ఇంటికొచ్చారు. పసికందుని ఒడిలో తీసుకొన్నారు. ముసిముసి నవ్వులతో ముద్దు పెట్టి కాబాకు తీసుకెళ్ళారు. ప్రార్థన చేశారు. తిరిగి ఇంటికి తెచ్చారు. 'ముహమ్మద్ (సఅసం)' అని మనుమడికి నామకరణం చేశారు. పుట్టిన ఎనిమిదవరోజు 'అఖీఖా' చేశారు. అందరిని ఆహ్వానించి విందు భోజనం పెట్టారు. వచ్చిన వారు ముత్తలిబ్‌ను అడిగారు అబ్బాయికి ముహమ్మద్ (సఅసం) అని ఎందుకు నామకరణం చేశారని తాతగారు మందహాసంతో "నా మనుమడి పేరు యావత్తు ప్రపంచ ప్రజానీకం ప్రస్తుతించాలనేదే నా సంకల్పం" అన్నారు.

**"అల్లాహుమ్మ సల్లి అలాముహమ్మదిన్ వ అలా ఆలి ముహమ్మదిన్ వ బారిక్ వ సల్లమ్"**

మక్కా నగరంలో ఒక సంప్రదాయం ఉండేది. పుట్టిన పిల్లలను పెంపకానికి పల్లెటూళ్ళకు పంపేవారు. అక్కడే వారు పెరిగి పెద్దయ్యేవారు. ముహమ్మద్ (సఅసం) కూడా గ్రామవాసాన్ని గడపడానికి పంపబడ్డారు. హలీమ (రజిఅల్లాహు అన్హు) ముహమ్మద్ (సఅసం)కు పాలిచ్చి పెంచారు. ఆమె సద్గుణ సంపన్నురాలు. పల్లె పరిసరాలలోని నిష్కల్మష వాతావరణంలో ముహమ్మద్ (సఅసం) ఆడుకొంటూ ఆరోగ్యమహాభాగ్యం నోచుకొన్నారు. పెద్దవారయ్యారు. స్వచ్ఛమైన భాష నేర్చుకొన్నారు. రెండు సంవత్సరాల తరువాత మక్కా పట్టణం వచ్చారు. అబ్బాయిని చూచి అమ్మగారు సంతోషపడ్డారు. అప్పట్లో మక్కా నగరంలో ఒక వ్యాధి ప్రబలింది. అందుచేత మళ్ళీ ముహమ్మద్ (సఅసం) హలీమ వెంట గ్రామానికి వెళ్ళారు.

అందమైన అబ్బాయి. అమాయక ముఖవర్చస్సు. చూస్తూనే అందరు ఆప్యాయంతో పలుకరించేవారు. అబ్బాయిగారి నోట వెలువడే ఆణిముత్యాల్లాంటి మాటలు వింటూ అందరూ ముగ్ధులయ్యేవారు. హలీమకు సంతానం ఉంది. ముహమ్మద్ (సఅసం)కు ఆమె పిల్లలంటే ఎంతో ప్రీతి. ఆ పిల్లవాండ్లకు ముహమ్మద్ (సఅసం) అంటే అమిత ప్రేమ. తమ వెంట తీసుకొని ఆటలాడేవారు. మేకలు మేపేందుకు వెళ్ళితే ముహమ్మద్ (సఅసం)ను కూడా వెంట తీసుకొని పోయేవారు.

ముహమ్మద్ (సఅసం) కూడా హలీమ మేకల్ని మేపారు. నాలుగు సంవత్సరాల వయస్సు రాగానే ముహమ్మద్ (సఅసం) తల్లి దగ్గరకు వచ్చారు. తనయుని చూచి తల్లికి సంతోషం కలిగింది. ఎనలేని ప్రేమతో పెంచసాగారు. ముహమ్మద్ (సఅసం)కు ఆరు సంవత్సరాల వయస్సు ఉండగా తనయుని తీసికొని తల్లి తన పుట్టినింటికి వెళ్ళింది. దైవ విధిని తప్పించు వారెవరు? దారిలో ఆమె వ్యాధిగ్రస్తురాలయ్యింది. పరలోకాన్ని చేరుకుంది. ఆరేండ్ల ప్రాయంలోనే ముహమ్మద్ (సఅసం) అనాథ అయ్యారు. తల్లిదండ్రుల నీడకు దూరమయ్యారు.

తాత అబ్దుల్ ముత్తలిబ్ అనాధ బాలునికి గార్డియన్ అయ్యారు. సుఖసౌఖ్యాలు కలుగజేస్తూ బాలుని పెంచారు. ఎనిమిది సంవత్సరాల వయస్సులో తాతగారు కూడా చనిపోయారు. పిన తండ్రి అబూతాలిబ్ బాలుని పెంచే బాధ్యత తీసుకొన్నారు. ఎందరో పినతండ్రులు. అందులో అబూతాలిబ్ దృఢ సంకల్పం గలవారు. ముహమ్మద్ (సఅసం)ను తన ప్రాణం కంటే ఎక్కువ జాగ్రత్తతో కాపాడేవారు.

ఎక్కడికి వెళ్ళినా ముహమ్మద్ (సఅసం)ను తన వెంట తీసుకొని పోయేవారు. కంటికి రెప్పలా చూచుకొనే వారు. ముద్దుగా పెంచేవారు. దూర ప్రయాణంపై వెళ్ళితే తోడుగా తీసికెళ్ళేవారు.

ఒకప్పటి విషయం. ముహమ్మద్ (సఅసం) లేత వయస్సులో ఉన్నారు. 'కాబా'లోని ఒక గోడ కూలి పడింది. గోడ మరమ్మత్తులో ప్రజలు పాల్గొంటున్నారు. పిల్లవాండ్లు కూడా తమ వంతు పని చేస్తున్నారు. పరుగెత్తుతు వెళ్ళి భుజాల మీద రాళ్ళను మోసుకొని వస్తున్నారు. గోడ నిర్మాణంలో భాగం పంచుకొంటున్నారు. పనిలో ముహమ్మద్ (సఅసం) కూడా తమ వంతు కృషి చేస్తున్నారు. కొద్ది సమయం గడిచింది. రాళ్ళను మోయడంలో పిల్లవాండ్ల భుజాలు నొప్పి పెట్టాయి. మొల గుడ్డలు తీసారు. భుజాల మీద వేసికొన్నారు. ముహమ్మద్ (సఅసం) అలా గుడ్డను విప్పి నగ్నంగా ఉండడానికి ఇష్టపడలేదు. పిన తండ్రి అబూతాలిబ్ అక్కడే ఉన్నారు. రాళ్ళను మోయడంలో ముహమ్మద్ (సఅసం) భుజాలు నొప్పి పెట్టడం చూశారు. నాయనా! నీవు నీ మొల బట్ట తీసి భుజంపై వేసుకోకూడదా? అన్నారు. పిన తండ్రి మాట జవదాట కూడదని మొల బట్ట తీయడానికి ప్రయత్నించారు. నగ్నంగా ఉండడం భరించలేకపోయారు. లజ్జా భారంతో స్పృహతప్పి పడిపోయారు. పిన తండ్రి ఈ పరిస్థితి గమనించారు. ఇక ఏ గుడ్డ విప్పకుండా, నగ్నంగా ఉండకుండా చేశారు. లజ్జను మించిన ఆభరణం మనిషికి మరొకటి ఉంటుందా!

## యవ్వనం

పిన తండ్రి రక్షణలో ముహమ్మద్ (సఅసం) పెరిగి, పెద్దవారై యవ్వన వయసుకు వచ్చారు. సమాజంలో అందరికంటే మంచి యువకుడుగా పేరు తెచ్చుకొన్నారు. అరబ్బు దేశంలోని అప్పటి సమాజం కల్లోల సంక్షుభితం. చీటికిమాటికి యువకులు కొట్లాడుకొనేవారు. కాని ముహమ్మద్ (సఅసం) తగవులకు దూరంగా ఉండేవారు. అప్పటి యువలోకం తీరే వేరు. మద్యం సేవించేవారు, రకరకాల జూదం ఆడేవారు, చెడు పనుల్లో జీవితం గడిపేవారు. ముహమ్మద్ (సఅసం)కు చెడు పనులంటే గిట్టేవి కావు. వాటిపట్ల అసహ్యం కలిగి ఉండేవారు. ఇక ప్రజల తీరు అయోమయం. విగ్రహాలను ఆరాధించేవారు. అబద్ధాలు పలికేవారు, సిగ్గు ఎగ్గూ లేకుండా మెలిగేవారు. ముహమ్మద్ (సఅసం) అన్ని దౌష్ట్యపు పనుల పట్ల విద్వేషం కలిగి ఉండేవారు. ఎప్పుడూ బీదసాదలకు అన్నదానం చేసేవారు. నిర్బలులకు సహాయపడేవారు.

## వ్యాపారం

పినతండ్రి వ్యాపారం చేసేవారు. ముహమ్మద్ (సఅసం) కూడా వ్యాపార వృత్తి చేపట్టారు. ఈ వృత్తి ఆయనకెంతో ఇష్టం. మంచి వ్యాపారిగా ప్రసిద్ధికెక్కారు. ఎప్పుడూ లావాదేవీలు చక్కగా చేసేవారు, సత్యం పలికేవారు. చెప్పేది ఒకటి, చేసేది మరొకటి ఆయన తీరు కాదు. సత్యసంధులు అని వేనోళ్ళ కొనియాడబడేవారు. అన్ని వ్యవహారాలు చక్కగా నిర్వహించేవారు. అమానతుదారుడని వాసికెక్కారు. అమీన్ అని పిలువబడ్డారు. సమాజంలో గౌరవ మర్యాదలు కలిగి ఉన్నారు.

## వివాహం

మక్కా నగరంలో ఒక భాగ్యవంతురాలు ఉండేవారు. ఆమె పేరు హజ్రత్ ఖదీజా (రజి). ఆమె వితంతువు; పెనిమిటి గతించి

పోయారు. ధనవంతురాలు అయినప్పటికి, వ్యాపారం చెయ్యడానికి ఎవరూ ఆమెకు తోడు ఉండేవారు కారు. ముహమ్మద్ (సఅసం) గుణగణాలు గుర్తించి వ్యాపారం చెయ్యడానికి ఆయనకు కావలసిన డబ్బులిచ్చారు. ఇచ్చిన డబ్బులతో సరుకులు కొన్నారు ముహమ్మద్ (సఅసం). సరుకులతో సిరియా దేశానికి వెళ్ళారు. అక్కడ చాలా లాభం సంపాదించారు.

మక్కా పట్టణం తిరిగి వచ్చి చేసిన వ్యాపారం లెక్క చిల్లిగవ్వతో సహా హజ్రత్ ఖదీజా (రజి)కి చూపించారు. బీబీ ఖదీజా సద్గుణ సంపన్నురాలు. ముహమ్మద్ (సఅసం)లో ఉన్న ఉత్తమోత్తమ గుణగణాలకు ముగ్ధురాలయ్యారు. సంతోషపడ్డారు. ముహమ్మద్ (సఅసం)ను వివాహం చేసుకొంటానని స్వయంగా సందేశం పంపారు. వచ్చిన సందేశాన్ని స్వీకరించారు ముహమ్మద్ (సఅసం). బీబీ ఖదీజా గారితో ఆయన (సఅసం) వివాహమయ్యింది. అప్పుడు ఆయన వయస్సు ఇరువది ఐదు సంవత్సరాలు మాత్రమే. బీబీ ఖదీజా (రజి) గారి వయస్సు నలుబది సంవత్సరాలు.

## శాంతి సంస్థాపన ప్రయత్నం

మక్కా నగరంలో ప్రజలు ప్రతి చిన్న పెద్ద పనికి తగవులాడుకొనేవారు. దౌర్జన్యపరులు కొందరయితే, ఆ దౌర్జన్యానికి బలై రోదించేవారు మరికొందరు. శాంతి సమాజంలో కరువైంది. పరిస్థితుల్ని గమనించిన ముహమ్మద్ (సఅసం) లోలోన కుమిలిపోయేవారు. చెడు నివారణోపాయం కోసం ఆలోచించేవారు. యువకుల్ని చక్కబెట్టేందుకు కృషిచేశారు. ఒక సంస్థ స్థాపించారు. సంస్థ సభ్యులతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. "మేము దేశం నుండి అశాంతిని తొలిగిస్తాం, ప్రయాణీకులకు రక్షణ కల్పిస్తాం. బీదలకు సహాయపడతాం. ఎవరిపై కూడా

దౌర్జన్యం సాగనివ్వం" అని సభ్యులందరు ప్రతిజ్ఞ చేశారు. ఈ శాంతి రక్షణ సంస్థ చేసిన కృషి వల్ల సమాజంలో జులుం తగ్గింది. అశాంతి దూరమవుతూ వచ్చింది. ముహమ్మద్ (సఅసం) సాధించిన ఘనకార్యాల వల్ల ఆయన శ్లాఘించబడుతూ వచ్చారు. ప్రజలకు ఆయనపై భరోసా కలిగింది.

మరో సంఘటన వినండి. 'కాబా'కు మరమ్మత్తులు చేస్తున్నారు. పాత గోడలు తొలగించి 'కాబా' నిర్మాణం చేస్తున్నారు. ఒక గోడలో 'హజరే అస్వద్' (నల్లరాయి) తగిలించవలసి ఉంది. ఈ నల్లరాయి హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారిని స్మరింపజేసే రాయి. అందరూ ఆ రాయిని పవిత్రంగా చూచుకొనేవారు. ఇక ఆ నల్లరాయిని గోడలో అమర్చే సమయం వస్తూనే నివురుగప్పిన నిప్పులా మక్కా వాసుల మధ్య వివాదం రగుల్కొన సాగింది. ఇబ్రాహీం (అలై) ను తలపించే ఈ పవిత్ర పాషాణాన్ని గోడలో తగిలించే భాగ్యం నీది కాదు నాది అని ప్రతి ఒక్కరూ తకరారు చేయడం మొదలెట్టారు. రాను రాను ఈ వివాదం ప్రాణ సంకటంగా మారేందుకు సిద్ధమయింది. చివరకు అందరు ఒక నిర్ణయా నికి వచ్చారు. రేపు ఎవరయితే అందరికన్నా ముందు ఇక్కడికి వస్తారో వారి తీర్పును మేమందరం ఆమోదిస్తాం అని ఒప్పుకొన్నారు. అదృష్ట వశాత్తు రెండవ దినం అందరికన్నా ముందు వచ్చే వారిలో ముహమ్మద్ (సఅసం) ఉన్నారు. అందరికి ఆయన తీర్పుపై నమ్మకం కలిగింది. చేసిన తీర్పు చూడండి – ఒక దుప్పటి తెచ్చారు. నల్లరాతిని దుప్పటి పై పెట్టారు. ఒక్కొక్క తెగ సర్దారును దుప్పటి అంచును పట్టుకొమ్మన్నారు. అందరూ కలిసి దుప్పటితోపాటు నల్లరాతినెత్తారు. గోడలో అతికించ వలసిన చోటు దాకా తీసుకెళ్ళారు. ముహమ్మద్ (సఅసం) ఆ రాతిని గోడలో అతికించాల్సిన చోట స్వయంగా పెట్టేశారు. నల్లరాయి ప్రతిష్టాపన జరిగింది. అన్ని తెగల వారు ఈ కార్యక్రమంలో పాలుపంచు కొనే భాగ్యాన్ని నోచుకొన్నారు. వివాదం పరిష్కృతమయింది కూడా.

## ప్రవక్త కావడం

మక్కా నగరానికి సమీపంలో ఒక కొండ వరుస వుండేది. ఈ కొండల మధ్య ఒక గుహ ఉండేది. ఆ గుహ పేరు 'హిరా'. ముహమ్మద్ (సఅసం) ఈ గుహకు వెళ్ళేవారు. పిండి, నీరు వెంట తీసికొని పోయేవారు. కొండ గుహలో ఒంటరిగా ఎన్నో దినాలు గడిపేవారు. అల్లాహ్‌ను ఆరాధించేవారు. ప్రజలకు మేలు చేకూర్చాలనే తలంపుతో సుదీర్ఘాలోచనలు చేసేవారు. చెడును రూపుమాపడానికి, మంచిని పెంచ డానికి మార్గాన్వేషణ చేసేవారు. చివరకు అల్లాహ్ ముహమ్మద్ (సఅసం)ను తన ప్రవక్తగా ఎన్నుకొన్నాడు. దేవదూత హజ్రత్ జిబ్రాయీల్ (అలై)ను ముహమ్మద్ (సఅసం) వద్దకు పంపాడు. హజ్రత్ జిబ్రాయీల్ (అలై)దైవ సందేశాన్ని ప్రవక్తల వరకు చేర్చేవారు. దైవ సందేశం తెచ్చారు. ముహమ్మద్ (సఅసం)కు వినిపించారు. ప్రవక్త గారు ఇంటికి వచ్చారు. బీబీ ఖదీజాకు ఈ సంగతి చెప్పారు. కాని ముహమ్మద్ (సఅసం) గాబరా పడ్డారు. బీబీ ఖదీజా ఆయన్ను ఓదార్చారు. మీకెందుకీ ఆందోళన. మిమ్మల్ని అల్లాహ్ వృధా చెయ్యడు. ఎప్పుడూ మీరు మంచి పనులు చేస్తారు. ధన ధాన్యాలు, అన్న పానీయాలు బీదసాదలకు ఇస్తారు, వారికి సహాయపడుతారు. అనాధలను, వితంతువులను ఆదుకొంటారు. అతిథులను సత్కరిస్తారు. పరుల బాధల్ని తొలగిస్తారు. వారి భారాన్ని భరిస్తారు. మీరెందుకు భయపడుతున్నారు?

ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ పంపిన సందేశం అందుకొన్నారు. ప్రజల వరకు చేర్చే పని ప్రారంభించారు. ప్రజలనుద్దేశించి ఇలా అనేవారు.

అల్లాహ్ ఒక్కడే. ఆయనే అందరి సృష్టికర్త, పోషకుడు మరియు శాసన కర్త కూడా. ఆయన ఆజ్ఞల్ని పాటించండి; ఆయన్నే ఆరాధించండి. నేను దైవ ప్రవక్తను. నన్నుసరించి జీవితం గడుపండి. చెడుకు

దూరంగా ఉండండి. మంచిని పెంచండి. మంచివారంటే అల్లాహ్ సంతోషపడుతాడు. స్వర్గం వారి నివాసంగా చేస్తాడు. చెడ్డ వారంటే అల్లాహ్‌కు గిట్టదు. వారికి దుర్భర శిక్ష ఇస్తాడు, నరకంలో పడేస్తాడు. మంచివారు ముహమ్మద్ (సఅసం) పిలుపునందుకొన్నారు, దైవ సందేశాన్ని స్వీకరించారు. హజ్రత్ అబూబకర్ (రజి) ముహమ్మద్ (సఅసం)కు ప్రాణ స్నేహితులు. మగవారిలో ఆయన ప్రప్రథమంగా ముహమ్మద్ (సఅసం) పట్ల విశ్వాసం ప్రకటించారు. హజ్రత్ ఖదీజా ముహమ్మద్ (సఅసం) సతీమణి. ఆమె మహిళలలో మొట్ట మొదట ప్రవక్త (సఅసం) పట్ల విశ్వాసం వెలిబుచ్చారు. హజ్రత్ అలి (రజి) ముహమ్మద్ (సఅసం) పినతండ్రి కుమారుడు. ముహమ్మద్ (సఅసం) పట్ల విశ్వాసం అంగీకరించిన బాలురలో ఈయనే మొట్టమొదటివారు. హజ్రత్ జైద్‌ను ముహమ్మద్ (సఅసం) పెంచుకున్నారు. గులాములలో విశ్వాసం తెచ్చిన ప్రథములు ఈయనే. ఈ నలుగురు చాలా మంచివారు. ఎప్పుడూ ముహమ్మద్ (సఅసం)తో ఉండేవారు. ఆయన సుగణ సంపదతో సుపరిచితులు. ముహమ్మద్ (సఅసం) సందేశం విన్నతోడనే ఆయన పట్ల విశ్వాసం ప్రకటించారు. అల్లాహ్ వీరందరితో సంతోషపడ్డాడు. సత్పురుషుల్లో చేర్చాడు.

## కొండ మీద పలుకు

దైవ సందేశ ప్రచారం ప్రజలలో ముమ్మరంగా సాగుతుంది. అల్లాహ్ ఆజ్ఞ వచ్చింది. "మార్గం తప్పిన మానవులకు దైవం విధించే నరక శిక్షతో భయపెట్టు" అన్నాడు ప్రభువు. ముహమ్మద్ (సఅసం) ఆ ఆజ్ఞను శిరసావహించారు. మక్కా పట్టణానికి సమీపంలో ఒక కొండ ఉంది. దాని పేరు సఫ్ఫా. ఈ కొండనెక్కారు ముహమ్మద్ (సఅసం). మక్కా వారందరిని పిలిచారు. అందరూ సమూహమయ్యాక ఇలా

అన్నారు "నేను కొండ మీద ఉన్నాను. మీరు కొండ క్రిందివైపున ఉన్నారు. నేను కొండకు ఇరువైపుల చూస్తున్నాను. మీరేమో ఒక వైపు మాత్రమే చూస్తున్నారు. ఒకవేళ కొండకు మరో వైపున దకాయిట్ల గుంపుంది, మీపై పడి దోచుకోనుందని అంటే మీరు నమ్ముతారా?"

మక్కా వాసులందరు ముక్త కంఠంతో "నిశ్చయంగా మీరు కొండపై ఉన్నారు. అన్ని వైపులా మీ దృష్టి ఉంది. మీరు సత్యసంధులు, అమానతుదారులు కూడా. ఎన్నడూ అబద్ధం పలుకలేదు. మీ మాటంటే మాకెంతో నమ్మకం" అని అన్నారు.

అయితే వినండి: "ప్రజలారా! అర్థం చేసుకోవటానికి ఇదొక ఉదాహరణగా మీకు చెప్పాను. మరణం అనేది ఎవరికీ తప్పేది కాదు. ఒక దినం మీరందరు తప్పక పరలోకవాసులవుతారు. మరణానంతరం అల్లాహ్ సమక్షంలో హాజరు కావలసి ఉంది. మీరే గనక నా పట్ల, నా సందేశం పట్ల విశ్వాసం కలిగి సజ్జనులుగా మారనట్లయితే మీపై అనూహ్యమైన శిక్ష పడుతుంది. మీరు ఇహలోక జీవితాన్నే చూస్తున్నారు. నేను రానున్న మరో జీవితం – మరణానంతర జీవితం కూడా చూస్తున్నా." మక్కా వారు కొండ మీద పలుకు విన్నారు. అందులోని వాస్తవం గ్రహించారు. ఎంత చక్కగా ముహమ్మద్ (సఅసం) జీవిత వాస్తవాన్ని వివరించారన్న విషయం అందరికి తెలుసు; ముహమ్మద్ (సఅసం) సత్యమే పలుకుతారు. కాని కొండ మీద నుండి చేసిన ప్రసంగంలోని సత్యాన్ని నమ్మలేకపోయారు. తమ బాగోగుల్ని తెలుసుకోలేకపోయారు. ముహమ్మద్ (సఅసం)ను నిందిస్తూ వెళ్ళిపోయారు. ఈసడించుకొంటూ, వదరుకొంటూ తిరిగి వెళ్ళిన వారిలో ముహమ్మద్ (సఅసం) పినతండ్రి అబూలహబ్ కూడా ఉన్నాడు.

## సమాజం ముహమ్మద్ (సఅసం)కు పెట్టిన బాధలు

ముహమ్మద్ (సఅసం) దైవ సందేశాన్ని వినిపిస్తున్నారు. ప్రజలు

చెడు పనులు చెయ్యకుండా ఆపుతున్నారు. మంచి పనులు చెయ్యమని ప్రేరేపిస్తున్నారు. సదాలోచన కలవారు ముహమ్మద్ (సఅసం) మాట విన్నారు, ముస్లిములయ్యారు. దైవానికి దాసులయ్యారు, మన ప్రియ ప్రవక్తకు తోడుగా నిలిచారు. చెడ్డవారు దైవ నిరాకరణులయ్యారు. దైవ సందేశాన్ని విని, విననట్లు నటించారు. వారి శ్రేయం కోరిన ప్రవక్తకు బద్ధశత్రువులయ్యారు. మొదట బెదిరింపులు, ఆ తరువాత హెచ్చరికలు చేశారు, ఆ తరువాత లాలూచి చూపించారు. అన్ని విధాల విఫలు లయ్యారు. చివరకు ఆయన్ని (సఅసం) వేధించడం, బాధించడం మొద లెట్టారు. ముహమ్మద్ (సఅసం) దారిలో వెళ్తూంటే ఆయన్ను వెక్కిరించేవారు. అవహేళన చేసేవారు. ఆయన (సఅసం)ను తిట్టని తిట్లంటూ లేవు. రాళ్ళతో కొట్టేవారు, నడిచే దారిలో ముండ్ల కంపలు వేసేవారు. నెత్తిమీద చెత్త చెదారం వేసేవారు. ఒకటేమిటి, ఆయన (సఅసం) మీద దుర్వాసన కొట్టే విసర్జిత మలినాలు పడేసేవారు. కాని మహాప్రవక్త (సఅసం) సహనంతో ఆ బాధలను భరించేవారు.

ఏదిఏమైనా ప్రజలకు ఋజుమార్గం చూపేవారు. మానవులను మోక్ష మార్గంపై నడిపించమని అల్లాహ్‌ను మనసార అర్థించేవారు. దౌర్జన్యపరుల అక్రమ కార్యక్రమాలకు అంతం ఉంటుందా? మహాప్రవక్త కుటుంబీకులందరిని సమాజం నుండి వెలివేశారు. అన్నం నీళ్ళు దొరకకుండా చేశారు. పసిపిల్లలు ఆకలి మంటలతో విలపించేవారు. తినడానికి తిండిలేక పస్తులు ఉంటూ వచ్చారు. గత్యంతరంలేక ఆకులు అలమలు తినసాగారు. ఈ సమయంలో ఆయన ఆత్మీయ పినతండ్రి అబూతాలిబ్ కూడా దివంగతులయ్యారు. తోడునీడగా జీవితం గడిపిన ఆయన ప్రియ సతీమణి హజ్రత్ ఖదీజా (రజి) కూడా ఇహలోకం వీడిపోయారు. వీరిరువురి యెడబాటు విద్రోహశక్తులకు మరింత అనుకూల వాతావరణం కల్పించింది. ముహమ్మద్ (సఅసం)ను బాధించడానికి మరింత అవకాశం కలిగింది.

ఒకసారి జరిగిన విషయం. ముహమ్మద్ (సఅసం) 'కాబా'లో నమాజు చేస్తున్నారు. ఒక దుండగుడు దూరాన్నుండి చూచాడు. తన దుప్పటిని చుట్టి తాడులా చేశాడు. ముహమ్మద్ (సఅసం) ఆ సమయంలో సజ్దాలో ఉన్నారు. ఆ తాటితో ఆయన గొంతుకు ఉరిలా వేశాడు, గట్టిగా లాగటం మొదలుపెట్టాడు. అంతలో హజ్రత్ అబూబకర్ (రజి) అక్కడకు వచ్చారు. కాఫిర్లను గద్దించి మందలించారు. వారు అతణ్ణి కూడా కొట్టి వెళ్ళిపోయారు.

కాఫిర్ల నాయకుడు అబూ జహల్. అతడు ముహమ్మద్‌కు బద్ధ శత్రువు. ముహమ్మద్ (సఅసం) నమాజు చేస్తుంటే వచ్చి పచ్చి పేడతో ఉన్న ఒంటె పొట్ట ప్రేవుల్ని తెప్పించాడు. ముహమ్మద్ (సఅసం) నెత్తిపై గుమ్మరిం చమన్నాడు. ఈ విషయం తన ముద్దుల కూతురు హజ్రత్ బీబీ ఫాతిమా(రజి)కి తెలిసింది. పరుగిడుకొంటు వచ్చిందామె. పేడతో నిండిన ఒంటె పొట్ట ప్రేవుల్ని తొలగించారు. దుర్వాసనతో నిండిన మలినాన్ని శుభ్రపరిచి దుండుగులకు హితబోధ చేశారు.

మహాప్రవక్త (సఅసం) అనుచరులను కూడా కాఫిర్లు హింసించే వారు. ఆ అనుచరులలో హజ్రత్ బిలాల్ (రజి) ఒకరు. ఆయన ఒక అవిశ్వాసి వద్ద బానిస. బానిస విశ్వాసి అయ్యాడని, ముహమ్మద్ (సఅసం)కు అనుచరుడయ్యాడని తెలియగానే ఆయన్ని వేధించడం మొదలెట్టాడు. ఎన్నో దినాలు పస్తుపెట్టాడు. కొట్టడం, తిట్టడం, మామూలయింది. నిండు వేసవిలో మండుచున్న ఎడారి ఇసుకలో పడేసి ఎదపై పట్టుకొంటే చెయ్యి కాలిపోయే రాతిని పెట్టాడు. మెడలో గొలుసులా తాడువేసి అల్లరి మూకల చేతికిచ్చాడు. తుంటరి వెధవలు అమాయకుడైన హజ్రత్ బిలాల్‌ను పట్టి రోడ్ల మీద లాగేవారు. ఇదంతా ప్రజలు తమాషాగా చూచేవారు. హజ్రత్ బిలాల్ పల్లెత్తు మాట పలకక బాధలన్నీ అల్లాహ్ మార్గంలో అనుభవించేవారు, సహించి మౌనం వహించేవారు.

మహాప్రవక్త అనుచరులలోని మరో వ్యక్తి హజ్రత్ ఖబ్బాబ్ (రజి). అతను ముస్లిం అయ్యారు. కాఫిర్లు అతనిపై విరుచుకుపడ్డారు. విపరీతంగా బాధలు పెట్టారు. ఒకనాడు దుష్టులు నిప్పులు పరిచారు. వాటి పై ఖబ్బాబ్(రజి)ను పరుండబెట్టారు. ప్రక్కకు తిరగకుండా ఎదపై కాలు పెట్టారు. మొత్తం వీపు కాలిపోయింది.

హజ్రత్ యాసిర్ (రజి) మహాప్రవక్త అనుచరులలోని వారు. అబూ జహల్ అతనిపై కక్ష సాధింపు చర్యలకు పూనుకొన్నాడు. అతని కుటుంబీకులందరిపై చర్య తీసికొన్నాడు. నానా హింసలకు గురి చేశాడు. చివరకు అతని సత్సీల సతీమణిని శూలంతో పొడిచి చంపాడు. (ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్).

ఒకటేమిటి దైవం పట్ల విశ్వాసం కలిగిన వారందరు సామూహిక హింసాకాండకు బలవుతూ వచ్చారు. కొందరికి జాలివేసింది. ఏమిటయ్యా ఎందుకు వారిని హింసిస్తున్నారు? వారు చేసిన నేరమేమిటి? సద్గుణవంతులుగా మంచి పౌరులుగా జీవించడం మీ కిష్టంలేదా? దైవానికి దాసులుగా బ్రతకడం మీరు సహించలేరా? దైవాభీష్టానుసారం జీవించడం మీకు కంటకప్రాయంగా ఉందా? మీ నుండి ఏమీ ఆశించక ఉచితంగా దైవ ప్రబోధన చేయడం మీకు పడదా? వారే కరువైతే మిమ్ములను సంస్కరించేనాథులే లేరు కదా? అని నిలదీసి అడిగారు కాఫిర్లను. అసలు ఖురైషు సర్దారులు దుర్జనులు. వారు తలచినట్లు ప్రజలను నడిపించేవారు. ప్రజలకు దేవుళ్ళు అయి పెత్తనం చెలాయించేవారు. కాని జులం సూర్యకాంతిలో దీపం లాంటిది. మన ప్రియ ప్రవక్తగారి సత్‌బోధనలు ప్రజల మనస్సుల్ని గెలిచాయి. వాటి ప్రభావం సమాజంపై ప్రగాఢంగా పడింది. తమలాంటి మానవుల ఆజ్ఞలు తిరస్కరించారు. అల్లాహ్ ఆజ్ఞల్ని అమలు పరచసాగారు. మన ప్రియ ప్రవక్తను తమ సర్దారుగా చేసికొన్నారు. అవిశ్వాసులకు ఇది

ముప్పుతెచ్చేలా కనబడింది. ఇస్లాం వ్యాపించిందంటే మా నాయకత్వం పలాయనమవుతుందని అనుకున్నారు. స్వార్థం కోసం అవధులు లేని ఆపదలు వారిపై పడేశారు. దైవ సహాయమున్న వారికి దానవులు ఏం చేయగలుగుతారని? దౌర్జన్యపరులు చేస్తున్న హింసాకాండను ఓర్పు, సహనాలతో భరించారు. దైవధర్మంపై నిలకడగా నిలిచారు. (దైవ ప్రసన్నత వారికి కలుగుగాక!)

## హబష్ దేశానికి వలస

కాఫిర్ల చేతిలో ముస్లింలు బాధించబడ్డారు. ముహమ్మద్ (సఅసం)ను తిట్టారు. కొట్టారు. ఆయన అనుచరుల్నీ హింసించారు. భరించరాని బాధల వల్ల ప్రవక్త ఆయన అనుచరులు తల్లడిల్లిపోసాగారు. ఖుర్ఆన్ పఠనం, దైవారాధన, ధర్మంపై నడవడం, ఇతరులకు ధర్మ బోధ చేయడం దుస్సాధ్యం అనిపించసాగింది. అప్పుడు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఆత్మీయ అనుచరుల్ని పిలిచి ఇలా అన్నారు : "మీరు దైవ ధర్మం కోసం అగచాట్లపాలయ్యారు. దూరాన అబిసీనియా దేశము ఒకటుంది. కావలసిన వారు ఆ దేశానికి వలస వెళ్లవచ్చు. ఆ దేశ రాజు నజ్జాషీ, మంచివాడు. అక్కడ మీకు ఏ అవరోధాలుండవు. స్వేచ్ఛగా సత్యధర్మాన్ని పాటిస్తూ, ఇతరులకూ ధర్మ బోధ చేసే అవకాశం కూడా వుంటుంది. చాలా మంది ముస్లింలు పరివార సమేతంగా ఇల్లు వాకిలి వదలి అబిసీనియాకు వలస వెళ్లారు.

కాని కాఫిర్లకు అంతటితో తృప్తి కలుగలేదు. ప్రవాసుల్ని వెంటాడుతూ అబిసీనియా చేరారు. ఆడంబరాలు పలుకుతూ అబిసీనియా రాజుకు శికాయతు చేశారు. కాందిశీకుల్ని రాజ దర్బారులో హాజరు పరిచారు. హజ్రత్ అలి (రజి) సోదరుడు హజ్రత్ జాఫర్ (రజి) వలస వచ్చిన ముస్లిములకు నాయకుడుగా ఉన్నారు. దర్బారులో ముస్లింల ఆవేదన వెలిబుచ్చే ప్రసంగం చేశాడు. ఆ ఉపన్యాసం దర్బారీలను

ప్రభావపరిచింది. ఉపన్యాస సారాంశం ఇలా ఉంది : ఓ రాజా! మేము అజ్ఞానులగా ఉన్నాం. ఏమీ తెలిసినవారము కాము. విగ్రహాదులను ఆరాధించేవారము. ముర్దారు (నిషేధించబడినవి) తినేవారము. అక్రమ సంబంధాలు కలిగి ఉండేవారం. తిట్లు తిట్టేవారం. అపరిశుభ్రంగా ఉండేవారం. పరస్పరం వాదులాడుకొనేవారం. కలిమిలేములు కలవారు కలిసి వుండేవారము కాము. అతిథి సత్కారాలు చేసేవారము కాము. పొరుగింటి వారితో సత్సంబంధాలు వుండేవి కావు. సోదరుల మధ్య సహృదయత ఉండేది కాదు. బలం కలవారు బలహీనులపై విరుచుకొని పడేవారు. అంతెందుకు మా లెక్క మంచివారిలో లేకుండింది. మా పనులన్నీ అధర్మపు పనులే. అల్లాహ్‌కు మాపై జాలి వేసింది. మాకు సన్మార్గం చూపదలచాడు. మాలో ఒక ప్రవక్తను పంపించాడు. మేమందరం ఆయనకు సుపరిచితులే. ఆయన చాలా మంచి వారు. సత్యసంధులు, అమానుతుదారులు కూడా. ఆయనే మాకు చక్కటి జీవిత మార్గం చూపించారు. సత్యధర్మ సందేశాన్ని మాకందజేశారు.

ధర్మజ్ఞులుగా మెలగమని పిలుపునిచ్చారు. మానవులకు అల్లాహ్ చూపిన వెలుగుబాట, అదే మానవుల మధ్య సుహృద్భావం పెంచిన శాంతిబాట. అంతవరకు ఆరాధించబడే విగ్రహాలను పూజించడం మానండన్నారు. అల్లాహ్‌ను ఆరాధించమని చెప్పారు. సత్యం పలుకండి. ఇచ్చిన మాట నిలబెట్టుకోండి. చెడుకు దూరంగా ఉండండి. పాపపు పనుల చెంతకు వెళ్ళకండి. అనాథల సొమ్ము తినకండి, హింసామార్గానికి దూరంగా ఉండండి. పొరుగు వారికి కష్టం కలిగించకండి. వారితో మైత్రీభావం ప్రకటిస్తూ హాయిని చేకూర్చండి. ఏ పాపమెరుగని అమాయక మహిళల పట్ల దుష్ప్రచారం చెయ్యకండి. నమాజులు చేయండి. దైవ మార్గంలో ధనం వ్యయపరచండి. పరస్పరం ఐకమత్యంతో మెలగండి అని బోధించారు. మేము ఆయన (సఅసం)ను ప్రవక్తగా గుర్తించాము. అల్లాహ్ పంపిన సందేశ ప్రబోధకునిగా విశ్వసించాము. ఆయన ప్రబోధన

ప్రకారం మా నడవడికలను మలచుకొన్నాం. మా మాటలు, చేతలు, సత్యధర్మానుసారం ఉంటూ వచ్చాయి. మాలో పరివర్తన వచ్చింది. కాని మా జాతి వారు మాకు వ్యతిరేకులయ్యారు. మమ్మల్ని హింసించసాగారు. భరించరాని బాధలకు గురయ్యాక మేము స్వదేశం వదలి ఇక్కడకు వలస వచ్చాం.

అబిసీనియా రాజు శ్రద్ధతో హజ్రత్ జాఫర్ (రజి) ఉపన్యాసం విన్నారు. ప్రభావితులయ్యారు. సత్య సందేశ సారాంశాన్ని అందు కొన్నారు. ఇంకా దివ్యఖుర్‌ఆన్ గ్రంథ వాక్యాలు విన్నారు. దైవ గ్రంథం లోని మాటలు ఆయన హృదయంలో హత్తుకొనిపోయాయి. కంట తడిపెట్టుకొంటూ, సత్ప్రర్తనకల వారిని వెంటాడుతూ వచ్చిన కాఫిర్లను తన దేశం వదలి వెళ్ళవలసిందిగా కోరారు. శరణార్థులుగా వచ్చిన ముస్లిములను గౌరవించారు. స్వయంగా కొన్ని రోజుల తరువాత ఆయన కూడ ముస్లిం అయ్యారు.

అప్పటి వరకు మన ప్రియ ప్రవక్త ఎక్కడికీ వలస వెళ్ళలేదు. అబిసీనియా కూడా వెళ్ళలేదు. మక్కాలోనే సహనంతో ఉన్నారు. కాఫిర్లు కలిగిస్తున్న దుఃఖాన్ని భరిస్తూవచ్చారు. దైవధర్మం వైపు ప్రజలను పిలుస్తూ వచ్చారు. జాతర్లు జరుగుతుంటే ముహమ్మద్ (సఅసం) అక్కడకు వెళ్ళి యాత్రికులకు ధర్మ ప్రబోధనం చేసేవారు. హజ్ చేయడానికి దూర దూర దేశాల నుండి ప్రజలు మక్కా మదీనా నగరాలకు వచ్చేవారు. వారికి ఏకేశ్వరోపాసనం అంటే ఏమిటో తెలిపేవారు. కాలక్రమేణా మక్కా నగర పరిసర ప్రాంతాలలో, దూర దూర పల్లెలలో మరియు పట్టణాలలో ఇస్లాం వ్యాపిస్తూ వచ్చింది.

మక్కాకు సమీపంలో ఒక ఊరు ఉండేది. దాని పేరు తాయిఫ్. ధర్మ ప్రబోధన కోసం మహాప్రవక్త తాయిఫ్ వెళ్ళారు. కాని అక్కడి ప్రజలు పాషాణ హృదయం కలవారు. మహాప్రవక్త (సఅసం) మాటల్ని

పెడచెవిన పెట్టారు. నడి బజారులో మహాప్రవక్త (సఅసం)ను నిందించారు. రాళ్ళు రువ్వి ఆయన్ను గాయపరిచారు. నానా దుర్భాషలాడారు. తుంటరి వెధవల్ని ఆయన (సఅసం) వెంట తగిలించారు. ఆయన (సఅసం)ను తరిమి వెళ్ళగొట్టమన్నారు. మహాప్రవక్త దేహం గాయాలతో రక్తసిక్తమయింది. కాని సహనంతో అన్నిటిని భరించారు. నోరు విప్పి శపించారు కాదు. ధర్మమెరుగని ప్రజలకు వెలుగుబాట చూపించమని ప్రభువును ప్రార్థించారు.

## మక్కా నుండి మదీనాకు

మదీనా అరేబియాలోని ఒక సుప్రసిద్ధ పట్టణం. మక్కా నుండి మదీనా చాలా దూరం ఉంది. మదీనావాసులు ప్రతి సంవత్సరం హజ్ కోసం మక్కా వచ్చేవారు. మన ప్రియ ప్రవక్త మదీనా నుండి వచ్చిన హాజీలను కలిసికొనేవారు. ముమ్మరంగా నిరాడంబరంగా వారిలో ధర్మప్రచారం చేసేవారు. మదీనా వాసులు మంచి మనస్తత్వం కలవారు. మన ప్రియ ప్రవక్త మాటలను శ్రద్ధాసక్తులతో ఆలకించేవారు. సత్యధర్మ మధువును తనివితీర గ్రోలి విశ్వాసవంతులయ్యేవారు. ఈ విధంగా ఇస్లాం మదీనా చేరింది.

మక్కాలో ఉన్న ధర్మ తిరస్కారులు రోజురోజుకు ముస్లిములపై జులుం అధికం చేయసాగారు. మన ప్రియ ప్రవక్తను హింసిస్తూ వచ్చారు. ఇక ఆయన మాటల్ని పట్టించుకొనే వారే కరువైపోయారు. పైగా వారందరు ఆయనకు బద్ధ విరోధులయ్యారు. చంపడానికి సిద్ధమయ్యారు. అలాంటప్పుడు మక్కా వదలి మదీనా వలస వెళ్ళాల్సిందిగా అల్లాహ్ మన ప్రియ ప్రవక్త(సఅసం)కు ఆజ్ఞ ఇచ్చాడు.

ఒకనాడు రాత్రి కాఫిర్లు కుట్ర పన్నారు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను హత్య చేయ నిర్ణయించారు. ప్రళయం వరకు ప్రపంచానికి వెలుగుబాట చూపించిన మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) దీపిక

నార్పదలిచారు. మూర్ఖులు ఒక మార్గం యోచించారు. ఒక్కొక్క తెగ నుండి ఒక మనిషిని సమాయత్తపరచారు. ముహమ్మద్ (సఅసం) ఇంటిని చుట్టుముట్టారు. ఆయన (సఅసం) ఇంటి నుండి బయటికి రాగానే అందరూ ఒక్కమారు ఆయనపై పడి చంపతలపెట్టారు. అల్లాహ్‌కు మన ప్రియ ప్రవక్త (సఅసం) అంటే ఎంతో ఇష్టం. ఈ కుట్ర సమాచారం ఆయన (సఅసం)కు తెలియపరిచాడు. ముహమ్మద్ (సఅసం) దివ్యఖుర్‌ఆన్ వాక్యాలు పఠిస్తూ ఇంటి నుండి బయటికి వెళ్లిపోయారు. కాఫిర్లు ఆయన ఇంటి చుట్టూ ఉన్నారు. అల్లాహ్ వారి కండ్లను కప్పి వేశాడు. మన ప్రియ ప్రవక్త (సఅసం)ను ఎవరూ చూడలేకపోయారు.

ముహమ్మద్ (సఅసం) వెంట ఆయన ప్రియ స్నేహితుడు హ్రజత్ అబూ బకర్ (రజి) ఉన్నారు. ఇద్దరు మక్కా నగరం నుండి బయటకు వచ్చారు. మక్కా వెలుపల ఒక గుహ ఉండేది. దాని పేరు 'సవరు' గుహ. ఇద్దరు ఆ గుహలో తలదాచుకొన్నారు. కాఫిర్లు వారిరువురి జాడ కోసం వెంటాడారు. చాలా దూరం వరకు గూఢాచారులను పంపారు. ఒక విద్రోహి గుహ ద్వారం వరకు చేరాడు. హ్రజత్ అబూబకర్ (రజి) భయపడ్డారు. ముహమ్మద్ (సఅసం) నిండు ప్రశాంతతతో ఇలా అన్నారు. "భయపడకు. అల్లాహ్ మన వెంట ఉన్నాడు" సమీపించిన కాఫిరు మతి అల్లాహ్ మరిపించాడు. అతడేమీ చూడలేకపోయాడు.

మూడు దినములు గడిచాక ముహమ్మద్ (సఅసం), అతని స్నేహితులు ఇద్దరు 'సవరు' గుహ వదలి మదీనా వెళ్ళారు. మదీనా ప్రజలు ముహమ్మద్ (సఅసం) రాక కోసం ఎదురు చూస్తున్నారు. మదీనా చేరగానే ప్రజావెల్లువ కదలి వచ్చింది. మహాప్రవక్త (సఅసం)కు ఘనస్వాగతం పలికింది. చిన్నారులు సంతోషంతో పాటలు పాడారు. ప్రతి ఒక్కరి ఆశ ఒక్కటే, ముహమ్మద్ (సఅసం) తమ ఇంట నిలువాలి.

ఇక విప్లవం పరవళ్లు త్రొక్కుతూ ముందుకు సాగింది. అత్యధిక సంఖ్యలో ముస్లిములు తమ ఇల్లు వాకిలి వదలి మదీనా వచ్చారు. అబిసీనియా వలస వెళ్ళిన ముస్లిములు కూడా మదీనా వచ్చేశారు. మదీనా వచ్చిన ముస్లిములు ముహాజిర్లనబడ్డారు. మదీనా పుర ప్రజలు ముహాజిర్లకు మద్దతు పలికారు. ఉండడానికి ఇళ్ళనిచ్చారు. జీవితం గడిపేందుకు వివాహ సౌకర్యాలు కల్పించారు. ఉపాధి కల్పనలలో ఉమ్మడి వ్యాపారస్తులుగా చేర్చుకొన్నారు. ఒకటేమిటి ముహాజిర్ల జీవితం సుఖప్రదం చేశారు. అందుచేతనే మదీనావాసులు అన్సారులు (సహాయపరులు) అనబడ్డారు.

## శాంతి కోసం సమరాలు

మన ప్రియ ప్రవక్త దయార్ద్రహృదయులు. యావత్తు ప్రపంచానికే కారుణ్య మూర్తిగా వచ్చారు. అందరి ప్రగతి ఆయన (సఅసం) మనోగతి. అందరి పట్ల ప్రేమానురాగాలతో మెలిగేవారు. తుదకు తనను హింసించిన వారి శ్రేయం అభిలషించారు. అటువంటి వారి కోసం కూడా ప్రార్థనలు చేశారు. దైవధర్మ సంస్థాపన కోసం స్వస్థలాన్ని వదిలారు. వలస వచ్చి మదీనా చేరారు. అక్కడ ప్రశాంత జీవితం గడపవచ్చునని అనుకొన్నారు. అందరికి అల్లాహ్ ఇచ్చిన ధర్మం బోధించవచ్చుని, ముస్లిములను దైవాభీష్టం ప్రకారం జీవితం గడిపేటట్లు చేయవచ్చని అనుకొన్నారు. కాని వైరుల విద్రోహం ప్రశాంతంగా జీవితం గడుపనిస్తుందా! మదీనాలో కూడా కాఫిర్లు తమ పన్నాగాలు పూనుతూ ముస్లిములను వేధించసాగారు. కాఫిర్లు మదీనా వచ్చేవారు, ముస్లిములపై బురదజల్లేవారు. మదీనాకు దగ్గర యూదులు నివసించేవారు. హజ్రత్ మూసా (అలైహి) గారి అనుచరులు వీరు. కాని వారి తీరుతెన్నులు, వ్యవహారాలన్నీ కాఫిర్లను పోలి ఉండేవి. వీరు మన ప్రియ ప్రవక్తకు శత్రువులయ్యారు. కాఫిర్లతో కలిసారు. ముహమ్మద్ (సఅసం)ను మోసగించసాగారు. ముస్లింల

మాటలన్ని గోప్యంగా కాఫిర్ల వరకు చేర్చేవారు, పచ్చి అబద్ధాలు పలికేవారు. చాడీలు చెప్పి తంటాలు తెచ్చేవారు. మదీనాలో కొందరు కపట విశ్వాసులుండేవారు. చూచేందుకు ముస్లిముల మిత్రులుగా మెలిగేవారు. కాని వారి మనో హృదయాలలో ముస్లింల పట్ల శత్రుత్వం ఉండేది. ఇలాంటి కాపట్యం కలవారు కూడా కాఫిర్లతో కలసి ముస్లిములను తమ విషవలయంలో చిక్కుకొనేట్లు చేసేవారు.

## బదర్ మహాసమరం

ఇస్లాం శత్రువులు ముస్లింలపై సర్వసన్నద్ధులై విరుచుకుపడ్డారు. అంతవరకు రణరంగానికి దూరంగా ఉంటూ వచ్చిన ముస్లింలకు తమ రక్షణ కోసం యుద్ధం చేసే అనుమతి ఇవ్వబడింది. కాఫిర్ సైన్యం అత్యధికంగా ఉంది. ముస్లింల సైన్యం అతి తక్కువగా ఉండేది. కాఫిర్ల బలం వెయ్యి మంది. ముస్లిం సైనికులు మూడు వందల పదమూడు. కాఫిర్ల వద్ద యుద్ధసామగ్రి, కత్తులు, కటార్లు బల్లేలు, విల్లు బాణాలు, కవచాలు అన్నీ ఉన్నాయి. సకల సన్నాహాలతో వచ్చిన శత్రుసైన్యం అది. ముస్లింల వద్ద ఉన్న సామగ్రి తక్కువ. 'బదర్' మైదానంలో ఇరు సైన్యాలు విజృంభించాయి. ఒకరు మరొకరిపై పడ్డారు. యుద్ధం బీభత్సంగా జరిగింది. ముస్లిములు సత్యధర్మం కోసం పోరాడారు. మన ప్రియ ప్రవక్త ఇస్లాం ధర్మం కోసం పోరాడారు. అల్లాహ్ మద్దతు వారి కోసం ఉంది. ముస్లిములు విజయవంతులయ్యారు. కాఫిర్లు ఓడిపోయారు. వారి అగ్రశ్రేణి నాయకులు యుద్ధంలో అసువులు బాసారు. అబూ జహల్ మరణించాడు. ఉతుబ ప్రాణాలు పొయ్యాయి. షేబా హతమయ్యాడు. డెబ్బది కాఫిర్లు చనిపోయారు. డెబ్బది మంది కాఫిర్లు యుద్ధ ఖైదీలుగా పట్టుకోబడ్డారు. మిగిలిన వారు వెనుదిరిగి కాళ్ళకు బుద్ధిచెప్పి పారిపోయారు.

## ఉహద్ యుద్ధం

రెండవ సంవత్సరం మళ్ళీ కాఫిర్లు ముస్లిములపై యుద్ధానికి తలపడ్డారు. ఉహద్ సమీపంలో ఈ యుద్ధం జరిగింది. ముస్లిముల సంఖ్య అతి స్వల్పంగా ఉంది. కాని అల్లాహ్ కృప వల్ల మళ్ళీ ముస్లిములు గెలుపొందారు. ఆ ఆనందంలో కాపలా కోసం నిర్ణయించబడ్డ సిపాయిలు తమ నెలవులు వదలి వెళ్ళారు. కాఫిర్లు అదనుచూచి స్థావరాలు వదలిన సైనికుల్ని చూచి ఆ మార్గాన వెళ్ళి మళ్ళీ యుద్ధం చేశారు. ముస్లింలకు భారీ నష్టం కలిగింది. ధైర్యసాహసోపేతులైన ముస్లిం సైనికులు అనేకులు అమరగతులయ్యారు. మన ప్రియ ప్రవక్త (సఅసం) రెండు పళ్ళు దెబ్బతిన్నాయి. రణరంగంలో ముస్లిములు మరోసారి తమ బలగాలను పుంజుకొని కాఫిర్లపై విజృంభించారు. దైవసహాయం వారికి లభించింది. ముస్లిములు మరోసారి కాఫిర్లను ఓడించారు.

ఎన్నో యుద్ధాలు కాఫిర్లు ముస్లిముల మధ్య జరిగాయి. పోరాటాలన్నిటిలో ముస్లిముల సంఖ్య తక్కువ. కాఫిర్లు ఎక్కువ. కాని ముస్లిములు సత్యం కోసం, ధర్మం కోసం ఎదురునిలిచేవారు. కాఫిర్లు అధర్మపరాయణులు. అందుచేతనే అల్లాహ్ అనుగ్రహం ఆరాధికులవైపే వుంటూ వచ్చింది. కాఫిర్లు పరాజితులయ్యేవారు. చివరకు కాఫిర్లు గత్యంతరం లేక ముస్లిములతో రాజీపడవలసి వచ్చింది, సంధి చేసుకొన్నారు.

## మక్కా విజయం

ముస్లింలు మరియు కాఫిర్ల మధ్య కుదిరిన సంధి కొన్ని దినముల వరకే చెల్లుబాటులో ఉంది. మళ్ళీ యథావిధి పోరాటాలు జరగడం మొదలయ్యాయి. ముస్లిములను 'కాబా'లో బలిచేశారు కాఫిర్లు. ఏ పాపమెరుగని ధర్మజ్ఞులు మక్కా కాఫిర్ల చేతుల్లో ప్రాణాలు కోల్పోయారు.

ఈ వార్త దావానలంలా మదీనా చేరింది. ముస్లిముల గుండెల్లో ప్రతీకార రక్తం ప్రవహించింది. మన ప్రియ ప్రవక్త పదివేల ముస్లిములను సమరానికి సమాయత్తపరిచారు. మక్కా నగరం వైపు పురోగమించారు. కాఫిర్లు ముస్లిముల మహాసైన్యాన్ని చూచి భయకంపితులయ్యారు. కొందరు పలాయనం చిత్తగించారు. మరికొందరు క్షమాపణ కోరుతూ మన ప్రియ ప్రవక్త పట్ల, ఇస్లాం కోరే జీవిత విధానం పట్ల విశ్వాసం ప్రకటించారు. మహాప్రవక్త (సఅసం) కరుణామృత హృదయం కలవారు, ఆశ్రయించినవారందరికి క్షమా భిక్షపెట్టారు. అల్లరిమూకల్లా ప్రవర్తించి, బద్ధవిరోధులుగా ఉండిన కాఫిరు ప్రియ ప్రవక్త (సఅసం)ను శరణు వేడారు. స్వేచ్ఛననుభవించారు. మక్కా మహానగరం మహాప్రవక్త (సఅసం) స్వాధీనమయింది. 'కాబా' నుండి విగ్రహాలు తొలగించబడ్డాయి. అల్లాహ్ ఆరాధన అన్ని చోట్ల జరుగనారంభ మయింది. ఆయన స్తుతిస్తోత్రాలు అన్ని దిశల వ్యాపించాయి. రాను రాను అరబ్బు భూభాగంలో ఇస్లాం ఢంకా మ్రోగింది.

## మన ఆత్మీయ ప్రవక్త (సఅసం) మిషను

మన ఆత్మీయ ప్రవక్త (సఅసం) మిషను పరిపూర్తయింది. అల్లాహ్ పంపిన సందేశం ప్రజల వరకు చేర్చబడింది. ఆయన (సఅసం) స్వయంగా దైవ సందేశానుసారం జీవితం గడిపి అందరికీ ఆదర్శమూర్తి అయ్యారు. ఇక ధర్మసందేశ ఆచరణాత్మక ప్రచారం కోసం ఒక సమాజాన్ని స్థాపించారు. ప్రపంచం వదలి పరలోక ప్రాప్తి పొందారు.

**అల్లాహుమ్మ సల్లి అలాముహమ్మదిన్ వ అలా ఆలిముహమ్మదిన్ వబారిక్ వ సల్లమ్**

దైవధర్మం సంపూర్ణంగా స్థాపించబడింది. మన ప్రియ ప్రవక్త తరువాత మరో ప్రవక్త లేదు. ఇక ధర్మప్రబోధన బాధ్యత ముస్లిముల